క్లుప్తంగా

స్టోన్ క్రషర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు : మండలంలోని కొత్తగట్టు శివారులోని సాయిరాం స్టోన్ క్రషర్ నిర్వాహకులపై అధికారులు చర్యలు తీసుకోవాలని మల్కపేట గ్రామానికి చెందిన రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన ఫిర్యాదు చేశాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రషర్ క్వారీ సమీపంలో ఉన్న తమ వ్య వసాయ భూములు దెబ్బతింటున్నాయన్నారు. తీవ్రమైన దుమ్ము, ధూళి, బాంబ్ బ్లాస్టలతో పంటలు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. క్రషర్ నిర్వాహకులపై అధికారులు చర్యలు తీసుకుని తమకు న్యాయంచేయాలని డిమాండ్ చేశారు.

బీసీలకు 45 శాతం సీట్లు కేటాయించాలి



ఐనవోలు: స్థానిక సంస్థల ఎన్నికల్లో 45 శాతం సీట్లు వెనుకబడిన తరగతుల వారికి కేటాయించాలని కోరుతూ నేషనల్ దోబీ రిజర్వేషన్ సంఘ జాతీయ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ టీపీసీసీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జ్, ఆల్ ఇండియా కాంగ్రెస్ జాయింట్ కో ఆర్డినేటర్ ఉల్లెంగుల యాదగిరి ఆల్ ఇండియా బ్యాక్వర్డ్ క్లాస్ ఫెడరేషన్ చైర్మన్, మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్యను కోరారు. శనివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించినట్లు తెలిపారు. కామారెడ్డి బహిరంగ సభలో బీసీ డిక్లరేషన్‌పై రాహుల్‌గాంధీ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో 45 శాతం రిజర్వేషన్ కల్పించాలని చెప్పారని ఈశ్వరయ్యకు గుర్తుచేసినట్లు తెలిపారు.

మల్లన్నను దర్శించుకున్న టెస్కాబ్ చైర్మన్



ఐనవోలు: ఐనవోలు మల్లికార్జునస్వామిని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వైస్ చైర్మన్ కొత్త కురుమ సత్తయ్య, మహబూబ్‌నగర్ డీసీసీబీ చైర్మన్ కోరమని వెంకటయ్యలు శనివారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. వేదాశీర్వచనం చేసి స్వామి వారి శేషవస్త్రాలు బహూకరించారు. వారి వెంట మండల నాయకులు మునిగాల సంపత్‌కుమార్, ఆడెపు దయాకర్, అడ్డగూడి సతీష్‌కుమార్, బొల్లెపల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఇంధన పొదుపు పాటించాలి



హన్మకొండ: డ్రైవర్లు ఇంధన పొదుపు పాటించాలని ఆర్టీసీ హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ సూచించారు. హనుమకొండ రాంనగర్‌లోని డిపోలో ప్రగతిచక్రం అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వృత్తిలో నైపుణ్యం ప్రదర్శించిన, సంస్థకు అధిక ఆదాయం తీసుకొచ్చిన ఉద్యోగులకు అవార్డులు, ప్రశంస పత్రాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఆయన మాట్లాడుతూ మెకానిక్‌లు బస్సులను కండీషన్‌లో ఉంచాలని, డ్రైవర్లు ఇంధనం ఆదా అయ్యేలా డ్రైవింగ్ చేయాలని తెలిపారు. బస్సులు బ్రేక్‌డౌన్ కాకుండా నిర్వహణ ఉండాలని పేర్కొన్నారు. అనంతరం లక్ష్యే లక్ష్యంలో భాగంగా సాంస్కృతిక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

చికిత్స పొందుతున్న యువతి మృతి



పల్లవి (ఫైల్)

దామెర: చికిత్స పొందుతూ యువతి మృతి చెందిన ఘటన మండలంలోని ఊరుగొండలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొచ్చు పల్లవి (20) ఈ నెల 22న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. బంధువులు వెంటనే చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందింది. మృతురాలి తండ్రి అశోక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.

అలంకారప్రాయం.. వైకుంఠధామాలు

- కనీస వసతులు లేని శ్మశానవాటికలు
- ఊరికి దూరంగా నిర్మించడంతో వినియోగంలోకి రాని పరిస్థితి
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా



పీచరలో నిర్మించిన వైకుంఠధామం



కరెంట్ సౌకర్యం లేని శ్మశానవాటిక

వేలేరు : బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన వైకుంఠధామాలు నేడు అలంకార ప్రాయంగా మారాయి. గ్రామాల్లో భూమిలేని నిరుపేదలు ఎవరైనా మరణిస్తే గతంలో చెరువు గట్లపై, వాగుల్లో దహనసంస్కారాలు నిర్వహించేవారు. వీటిని గమనించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ గ్రామంలో వైకుంఠధామాలు ఉండాలనే ఉద్దేశంతో గ్రామాల్లో శ్మశానవాటికలను నిర్మించింది. వాటిలో కొన్నింటిని ఊరికి దూరంగా నిర్మించింది. మరికొన్నింటికి సరైన రోడ్డు సౌకర్యం లేదు. వైకుంఠధామాలను ఊరికి దూరంగా నిర్మించడంతో అక్కడి వరకు శవాలను తీసుకెళ్లలేక ఎప్పటిలాగే గ్రామ శివారు ప్రాంతాల్లో, చెరువుగట్లపై, వాగుల్లో దహన సంస్కారాలు చేస్తున్నారు. అలాగే వైకుంఠధామాల్లో విద్యుత్ సౌకర్యం, నీటివసతి, మౌళిక సౌకర్యాలు కల్పించలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఊరికి దగ్గర్లోనే దహన సంస్కారాలు చేస్తున్నారు. లక్షల రూపాయలు ఖర్చు పెట్టి నిర్మించిన వైకుంఠధామాలు అలంకారప్రాయంగా మారడంతో నిధులు వృథా అయ్యాయనే వాదన ప్రజల్లో ఉంది.

ప్రజాధనం వృథా..

మండలంలోని 14 గ్రామ పంచాయతీలు ఉండగా అన్ని గ్రామాల్లో వైకుంఠధామాలు నిర్మించారు. ఒక్కో వైకుంఠధామాన్ని రూ.10 లక్షల నుంచి రూ.12.60 లక్షలతో ఉపాధి హామీ నిధులు, జీపీ నిధుల నుంచి నిర్మాణాలు చేపట్టారు.

సౌకర్యాలు కరువు

మండలంలో నిర్మించిన వైకుంఠధామాలను వినియోగించుకునేలా అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారు. చాలావరకు వైకుంఠధామాల్లో నీటి వసతి, విద్యుత్ సౌకర్యం లేవనే చెప్పాలి. నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు ఇప్పటి వరకు బిల్లులు రాక నిర్మాణ పనులకు తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నామని వాపోతున్నారు. కొన్నిచోట్ల వైకుంఠధామాలను ఊరికి రెండు, మూడు కిలోమీటర్ల దూరంగా కట్టడంతో అంత దూరం వెళ్లలేకపోతున్నారు.

ఊరికి దూరంగా నిర్మించారు



పీచర గ్రామంలో నిర్మించిన వైకుంఠధామం ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో నిర్మించారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే అంతదూరం వెళ్లలేక గ్రామానికి దగ్గర్లోని జంగంకుంట, మంచినీళ్ల వాగుల్లోనూ దహనసంస్కారాలు నిర్వహిస్తున్నాం. దీంతో వైకుంఠధామం ఉపయోగంలోకి రాకుండా పోయింది. – మండల సంపత్ కుమార్

నూతన చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న పరకాల సివిల్ కోర్టు జడ్జి శాలినిలింగం

ఆత్మకూరు : నూతన చట్టాలపై సమాజంలోని ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలని పరకాల సివిల్ జడ్జి శాలినిలింగం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, గంజాయి, మాదకద్రవ్యాల జోలికి వెళ్లవద్దన్నారు. బాలికలు లైంగిక వేధింపులపై అప్రమత్తంగా ఉండాలని వేధింపులకు గురైతే పాఠశాలలో ఉపాధ్యాయులకు, ఇంటి వద్ద తల్లిదండ్రులకు చెప్పాలని సూచించారు. ఎక్కడైనా నేరాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గుడెప్పాడ్‌కు చెందిన రేమిడి మల్లారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు విజేందర్‌రెడ్డి, రాజురెడ్డిలు ఇచ్చిన గోల్డ్ మెడల్, రూ. 1000 నగదు జడ్జి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఏసీపీ కిశోర్‌కుమార్, సీఐ సంతోష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండెల స్వామి, పరకాల మాజీ పీపీ రోడ్ల భాస్కర్‌రెడ్డి, హైకోర్టు ఏజీపీ గట్ల విజయపాల్‌రెడ్డి, న్యాయవాదులు టింకిలికారి సత్యనారాయణ, ఒంటేరు రాజమౌళి, మెరుగు శ్రీనివాస్, మోహన్, ప్రధానోపాధ్యాయులు నిర్మలకుమారి, తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్‌మెయిల్‌కు పాల్పడిన వారిపై చర్య తీసుకోవాలి

శాయంపేట : గత నాలుగేళ్ల నుంచి ఇంటికి దారి లేకుండా అక్రమంగా గోడ కట్టి, రూ.10 లక్షల విలువ చేసే వస్తువులను ఎత్తుకెళ్లి, పొలాల మధ్య సరిహద్దులను ధ్వంసం చేస్తూ భూతగాదాలు సృష్టిస్తున్న వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కొందరి ప్రోత్సాహంతో పురుగుల మందు డబ్బాతో బెదిరిస్తూ బ్లాక్‌మెయిల్ చేసిన వారిపై చర్య తీసుకోవాలని బాధిత రైతు కొమ్ముల బాబు– సుగుణలు వేడుకున్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ మా తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమితో పాటు మేము ఖరీదు చేసి కొనుక్కున్న భూములు సాగు చేసుకుంటుంటే వాటిని అన్యాయంగా లాక్కోవాలన్న ఉద్దేశంతో మా సోదరుడు ఆనందం, అతని కూతుర్లు, అల్లుళ్లతో పాటు పథకం ప్రకారం ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. మా సొంత భూమిలోనే వేపచెట్లను నరికి వేసి అమ్ముకున్నారని, పొలానికి వేసుకున్న సరిహద్దులను ధ్వంసం చేసి కలుపుకున్నట్లు తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టగా తప్పయిందని ఒప్పుకున్నట్లు తెలిపారు. మరో చోట కూడా ఒడ్లను తెంపడంతో మళ్లీ ఫిర్యాదు చేయగా పోలీసులు ఆనందంను తీసుకొని రాగా అతని భార్య అనసూయ కొంత మంది ప్రోద్బలంతో పురుగుల మందు డబ్బాతో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బ్లాక్ మెయిల్ చేసిందని ఆరోపించారు. భూమి ఆక్రమణ విషయంలో మాకు న్యాయం చేయాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ విజయచందర్‌రెడ్డి

కమలాపూర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, హుజూరాబాద్ నియోజకవర్గ ప్రబారీ డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి పిలుపునిచ్చారు. బీజేపీ మండల కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి అధ్యక్షతన శనివారం మండలకేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను బూతుల వారీగా సమీక్షించారు. అనంతరం విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరు ఆ రెండు పార్టీలు కుమ్మక్కై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసే విధంగా కనబడుతోందన్నారు. గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు రూ.లక్షల కోట్లు ఇచ్చినా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదనడం హాస్యాస్పదమన్నారు. గ్రామాల్లో అంతర్గత రోడ్లు, పారిశుద్ధ్య సమస్యలతో ప్రజలు రోగాల బారిన పడి విలవిల్లాడుతున్నారని, వీటన్నిటిపై స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని తీర్మానం చేశారు. పార్టీలకతీతంగా కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయాల్సిన స్థానిక ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పక్షపాత ధోరణితో బీజేపీ కార్యకర్తల కుటుంబాలకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులు ఇవ్వడం లేదని ఆరోపించారు. అర్హులైన లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయించాలని కోరుతూ కమలాపూర్‌కు వచ్చిన ఆర్డీఓ వెంకట్‌కు బీజేపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు తుమ్మ శోభన్, భూపతి ప్రవీణ్, కొండం శ్రీనివాస్, బోగి భిక్షపతి, జనగాని కుమారస్వామి, బండి కోటేశ్వర్, కనుకుంట్ల అరవింద్, చెలికే శ్రీనివాస్, పబ్బు సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

చందాల పేరుతో వేధిస్తున్న వ్యక్తులపై ఫిర్యాదు



హన్మకొండ అర్బన్: ఇటీవల కాలంలో కొంతమంది విద్యార్థి సంఘాలు, కుల సంఘాల పేరుతో తరచూ చందాల పేరుతో వేధిస్తున్న వ్యక్తులపై చర్యలు చేపట్టాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమానులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్యకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో శ్రమకోర్చి విద్యాభివృద్ధికి అంకిత భావంతో కృషి చేస్తున్న తమను సభలు, సమావేశాల పేరుతో డబ్బులు అడుగుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు పేర్కొన్నారు. చందాల ఇవ్వాలనే డిమాండ్‌తో కళాశాలల ఎదుట ఆందోళనకు దిగుతున్న వ్యక్తుల పేర్లను కలెక్టర్‌కు అందించినట్లు తెలిపారు.

గుంతలు తేలిన అంతర్గత రోడ్లు



గాంధీ విగ్రహం నుంచి వాటర్‌ప్లాంట్‌కు వెళ్లే దారిలో ఏర్పడిన గుంతలు

వేలేరు : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న అంతర్గత రోడ్లపై గుంతలు తేలి చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతున్నాయి. మండలంలోని పీచర గ్రామంలోని గాంధీ విగ్రహం నుంచి బాల వికాస వాటర్‌ప్లాంట్‌కు వెళ్లే అంతర్గత రోడ్డుపై అడుగుకో గుంత తేలి ప్రయాణం నరకప్రాయంగా మారింది. గ్రామంలోని రెండు క్రషర్లకు సంబంధించిన టిప్పర్ లారీలు హెవీలోడ్‌తో వెళ్తుండడంతో బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో ఆ రోడ్డుపై నుంచి వెళ్లాలంటే వాహనదారులు, రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గోడలకు విద్యుత్ షాక్

- ఆందోళనలో ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు



ఎంపీడీఓ కార్యాలయం

శాయంపేట : వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గోడలు నాని విద్యుత్ షాక్ వస్తుందని కార్యాలయంలోని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిషత్ కార్యాలయం నిర్మించి 30 సంవత్సరాలు పైన అవుతుందన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గోడలు నానడంతో గోడలలో ఉన్న స్విచ్ బోర్డుల్లోకి నీరు చేరి విద్యుత్‌షాక్ వస్తుందని కార్యాలయ సిబ్బంది సనత్, విజయ అన్నారు.

చర్యలు చేపడుతాం

భవనం నిర్మించి 30 ఏళ్లు దాటడంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గోడలు నాని విద్యుత్ షాక్ వస్తుందని ఎంపీడీఓ ఫణిచంద్ర తెలిపారు. వర్షాలు తగ్గిన తర్వాత విద్యుత్ స్విచ్ బోర్డులను మరమ్మతు చేయించి విద్యుత్‌షాక్ రాకుండా చూస్తామని చెప్పారు.

తెరుచుకోని పశువైద్యశాల

- పాడి పశువులతో రైతుల పడిగాపులు
- వర్షంలోనే రెండున్నర గంటలు నిరీక్షణ
- మధ్యాహ్నం 12 దాటినా సిబ్బంది రాక వెనుదిరిగిన రైతులు



వర్షంలో పశువుతో కలిసి ఆస్పత్రి ఎదుట నిరీక్షిస్తున్న రైతులు



పశువైద్యశాలకు వేసి ఉన్న తాళం

కమలాపూర్: మండలకేంద్రంలోని పశువైద్యశాలకు రైతులు పాడిపశువుల వైద్యంకోసం వస్తే తెరుచుకోలేదు. దీంతో వైద్యంకోసం వచ్చిన రైతులు పశువైద్యశాల ఎదుట వర్షంలో గంటల తరబడి నిరీక్షించారు. మధ్యాహ్నం 12 గంటలు దాటినా వైద్యులు, సిబ్బంది ఎవరూ రాకపోవడంతో పశువులకు వైద్యం చేయించుకోకుండానే రైతులు వెనుదిరిగిపోయిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పాడి రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శంభునిపల్లికి చెందిన దుంద్ర ఐలయ్య తమ గేదె ఎదకు వచ్చిందని, పశువైద్యుడికి చూపిద్దామని తన భార్యతో కలిసి ఐదుకిలోమీటర్ల దూరం నుంచి ఉదయం 9–30 గంటల ప్రాంతంలో వర్షంలో కమలాపూర్ పశువైద్యశాలకు వచ్చానని తెలిపాడు. ఇక్కడకు వచ్చేసరికి వైద్యశాలకు తాళం వేసి ఉంది. అతని వద్ద ఉన్న ఓ నంబర్‌కు ఫోన్ చేయగా అది నా ఇన్‌చార్జ్ కాదని ఉప్పల్ పశువైద్యశాల నుంచి చెప్పడంతో ఇక్కడి వారికైనా చెప్పమని కోరగా వారి నంబర్లు తమ వద్ద లేవన్నారని సమాధానం చెప్పాడు. ఆ తర్వాత మూడుసార్లు ఫోన్ చేసినా ఎత్తలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఆస్పత్రికి వచ్చిన తర్వాత కమలాపూర్‌కు చెందిన ఒకరు గొర్రైతో, మరొకరు కుక్కతో, ఇంకొకరు ఆవుతో ఇలా పలువురు రైతులు పశువైద్యశాలకు వచ్చిపోయారని తెలిపారు. గత రెండు, మూడు రోజులుగా పశువుల ఆస్పత్రికి వైద్యులు, సిబ్బంది రావడం లేదని, ఖరీఫ్ పంటసాగు సమయంలో ఇలా తమ పాడి పశువుల వైద్యం కోసం వస్తే ఇక్కడ ఎవరూ లేకపోవడంతో తమ పశువులకు వైద్యం అందడం లేదన్నారు. పశువైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండేలా చూడాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి డాక్టర్ విక్రంను వివరణ కోరగా ఆస్పత్రి తెరువని విషయం తనకైతే తెలియదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగుచర్యలు తీసుకుంటామని చెప్పారు.

కార్మిక సదస్సును జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వెంకట్, కార్మికులు

హన్మకొండ: కార్మికుల చట్టాల సవరణ వ్యతిరేక సదస్సును జయప్రదం చేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలో తెలంగాణ అసంఘటిత కార్మిక సంఘాల సమాఖ్య కరపత్రాలను కార్మికులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 4న వరంగల్‌లో కార్మికవర్గ హక్కుల సాధన, కేంద్ర ప్రభుత్వం చేసిన కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్మిక చట్టాలను నరేంద్ర మోదీ ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాసిందని దుయ్యబట్టారు. ఈ క్రమంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కార్మికులు దాసరి రమేష్, ఉమ, విజయ, జ్యోతి, మమత, సంధ్య, వినోద, నాగమణి, మమత, ఇందిర, శోభ పాల్గొన్నారు.

నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలి



భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారులు

కాశిబుగ్గ: తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలను చైతన్యవంతులను చేసిన ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి ఎంజీఎం జంక్షన్ వరకు భిక్షమెత్తుతూ శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వస్తే తమ బతుకులు బాగుపడుతాయని అనుకుంటే గత ప్రభుత్వం తమను వాడుకుని జీవితాలను ఆగం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడు నెలల్లో ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఎనిమిది నెలలు గడుస్తున్నా కళాకారులకు ఇచ్చిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోలేదని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకొని ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కళాకారుల సంఘం నాయకులు గద్దం సుధాకర్, ఎస్‌కె.రాజు, బిర్రు సురేందర్, గుండెకారి సునీల్, రమేష్, రవి, అశోక్, సదానందం, రవిరాజ్, రజినికాంత్, రమ, రజిత తదితరులు పాల్గొన్నారు.


5 వరకే రైతు బీమా గడువు

గీసుకొండ : గతేడాది ఆగస్టు తర్వాత కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకం పొందిన అర్హులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 5 వరకు మాత్రమే గడువు ఉందని ఏఓ హరిప్రసాద్‌బాబు తెలిపారు. మండలంలోని మొగిచర్ల రైతువేదికలో ఏఈఓలతో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది జూన్ 28 నాటికి పట్టాదారు పాసుపుస్తకం పొందిన 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్కులైన రైతులు అర్హులని చెప్పారు. దరఖాస్తు ఫారంతోపాటు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డుల జిరాక్సులను సబంధిత క్లస్టర్లలో ఏఈఓలకు అందించాలని తెలిపారు. బీమా పాలసీలో తప్పులు సవరించుకునేందుకు ఈనెల 30 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వసతి గృహాన్ని తరలించాలి

హన్మకొండ: హనుమకొండ జులైవాడలోని గిరిజన సంక్షేమ శాఖ పోస్ట్‌మెట్రిక్ బాలికల వసతి గృహాన్ని హనుమకొండ అశోకకాలనీలో గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయాల ఆవరణలో నిర్మించిన నూతన భవనంలోకి మార్చాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యను శనివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్, గిరిజన రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోత్ భాస్కర్ నాయక్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ హనుమకొండ, వరంగల్ వసతి గృహాలు రెండు ఒకే క్యాంపస్‌లో ఉన్నాయని తెలిపారు. అందులో ఒకదాన్ని అశోకకాలనీలో నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్చాలని సూచించారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి



నిరసన తెలుపుతున్న కమిటీ జిల్లాల బాధ్యులు

విద్యారణ్యపురి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.31శాతం నిధులే కేటాయించిందని, కనీసం 20శాతం నిధులు కేటాయించాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన తెలిపారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో అఖిల భారత విద్యాహక్కు వేదిక కోశాధికారి డాక్టర్ గంగాధర్, భారత్ బచావో జిల్లా బాధ్యులు డాక్టర్ వెంకట్‌రెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి, డీటీఎఫ్ జిల్లా జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రఘుపతి మాట్లాడుతూ విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పేర్కొన్న హామీనైనా నిలబెట్టుకోకపోవడం శోచనీయమని విమర్శించారు. కార్యక్రమంలో ట్రైబల్ డెమొక్రటిక్ ఫ్రంట్ జిల్లా బాధ్యుడు ఉదయ్‌సింగ్, తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ బాధ్యులు గోవిందరావు, రాజ్‌మహ్మద్, సుదర్శనం, రాంరెడ్డి, నర్సింహులు, కుమారస్వామి, భాస్కర్, ఆనందచారి, రాజ్‌కుమార్, మల్లయ్య, రమేష్, శ్రీరామ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోవాలి

న్యూశాయంపేట: గురుకులాల్లో పనిచేస్తూ ఇటీవల ప్రమోషన్లు, బదిలీలు, నూతన నియామకాల కారణంగా ఉద్యోగాలు కోల్పోయిన ఉపాధ్యాయులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోవాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖుర్షీద్ పాషా డిమాండ్ చేశారు. వరంగల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వందలాది గురుకులాలు ఏర్పాటుకాగా, నిబద్ధతతో పనిచేస్తూ విద్యాభివృద్ధి కోసం వారు తమ వంతు కృషిచేశారని గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో గ్రేస్ మార్కులు ప్రకటించి తగిన ప్రాధాన్యత కల్పిస్తామని, ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని ప్రకటించి వాడుకుని వదిలేసిందని ఆరోపించారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాల్లో పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఇచ్చి ఆదుకోవాలని తెలిపారు. సమావేశంలో రాజయ్య, శేఖర్, మధు, పరశురాములు, రమణ, తదితర నాయకులు పాల్గొన్నారు.